క్లుప్తంగా

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ మేరి, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణాకార్యక్రమాన్ని నిర్వహించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పరిశుద్ధ్యం, హార్టికల్చర్, గృహ నిర్మాణాలు తదితరాలు ఏవిధంగా సమకూర్చుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ముందుగా అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న గౌరీశ్వర్ నాయుడు

నందికొట్కూరు: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం ఆగదని వాల్మీకి బోయ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ నెల 17వ తేదీన అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణంలోని దేశాయ్ ఫంక్షన్ హాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి వర్క్‌షాపు కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్, మహేష్, రాంబాబు, మద్దిలేటి, దరగయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: ఓటు విలువపై బీఎల్‌ఓలు ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 23,24 తేదిలలో మండలంలో నిర్వహించే ఓటర్ల స్పెషల్ క్యాంపెన్‌డేకు సన్నద్ధం కావాలన్నారు. కొత్తగా ఓటు నమోదు, తప్పొప్పులు సవరణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్

మహానంది: పట్టణ ప్రాంతాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు ఇచ్చి పేదలకు ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. అబ్బీపురం గ్రామంలోని గిరిజన కాలనీలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో 18న సచివాలయాల వద్ద చేపట్టనున్న ఆందోళన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి సామేలు, సహాయ కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో పవన్ కుమార్

వెలుగోడు: అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ పవన్ కుమార్ సూచించారు. మండలంలోని వేల్పనూరు, వెలుగోడు గ్రామాల్లో సాగు చేసిన పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావం తగ్గేంత వరకు పంట కోతలు చేపట్టొద్దన్నారు. వరి పైరు వర్షాలకు నేల వాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అంజిత్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది మహేంద్ర, రామకష్ణ రైతులు పాల్గొన్నారు.

ఇల కైలాసం.. కార్తీక శోభితం

- సంప్రదాయబద్ధంగా పుణ్యనదీహారతి
- దేదీప్యమానంగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి
- మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం



శ్రీశైలంలో జ్వాలాతోరణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న దేవస్థాన అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలచరించిన భక్తులు ఆలయం ఎదురుగా గంగాధర మండపం, ఉత్తర మాఢవీధిలో కార్తికదీపాలను వెలిగించి, ప్రత్యేక నోములు, పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులందరికి స్వామివారి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు స్వామి వారి అలంకార దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి, అధికారులు పర్యవేక్షణ చేశారు.

నేత్రానందభరితం..జ్వాలాతోరణోత్సవం:

కార్తీకపౌర్ణమి సందర్భంగా శ్రీశైలంలో జ్వాలాతోరణోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి దేవస్థాన అధికారులు జ్వాలాతోరణోత్సవానికి వత్తులను తీసుకువచ్చారు. గంగాధర మండపం వద్ద స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదిహారతులిచ్చారు. అనంతరం నేతితో తడిపిన నూలు వత్తులను ఏర్పాటు చేసి తిరిగి నెయ్యి పోసి వత్తులను వెలిగించారు.

శాస్త్రోక్తంగా పుణ్యనదీహారతి

శాస్త్రోక్తంగా పాతాళగంగ వద్ద కృష్ణానదికి విశేష పూజలు నిర్వహించారు. పాతాళగంగ వద్దగల కృష్ణవేణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి నదీమాతల్లికి ఏకాదశ(పదకొండు) హారతులు ఇచ్చారు. ఏకహారతి, నేత్రహారతి, బిల్వహారతి, నాగహారతి, పంచహారతి, పుష్పహారతి, నందిహారతి, సింహహారతి, నక్షత్రహారతి, విష్ణుహారతి, కుంభహారతులు ఇచ్చారు.

దేదీప్యమానంగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతులు

కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణికి హారతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్షదీపోత్సవ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు ఆశీనులు చేసి అర్చకులు, వేదపండితులు విశేషంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం పుష్కరిణి ప్రాంగాణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. అలాగే శ్రీస్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు చేసి దశవిధ హారతులైన ఓంకారహారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూర హారతి ఇచ్చారు.

- గంగాధర మండపం వద్ద నిర్వహించనున్న జ్వాలాతోరణోత్సవానికి వినియోగించే నూలు ఒత్తులను బాపట్ల జిల్లా వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నానికి చెందిన చింతా రామకృష్ణారావు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా మేళతాళలతో ఆలయ ప్రవేశం చేసి ప్రదక్షిణపూర్వకంగా నూలు ఒత్తులను సమర్పించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ జాయింట్ కమిషనర్, కార్తీక మాసోత్సవాల ప్రత్యేక అధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఎస్పీ పర్యవేక్షణ

శ్రీశైలం: కార్తీక పౌర్ణమి ఉత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శ్రీశైలం క్షేత్రంలో బందోబస్తును పర్యవేక్షించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, వన్ టౌన్ సీఐ ప్రసాద్ రావు ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలిచ్చారు.

మహానందిలో

మహానంది: మహానంది ఆలయానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీకదీపాలు వెలిగించారు. యాగశాల వద్ద దీపాల నుంచి మంటలు అధికంగా రావడంతో వేడిమికి తట్టుకోలేక భక్తులు పరుగు తీశారు.

- ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంక అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, అర్చకులు శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులను కల్యాణం నిర్వహించారు.
- ఆర్జితసేవాటికెట్లు, అభిషేకాలు, నోములు, ప్రసాదాలు, వసతిగదులు, తదితర విభాగాల ద్వారా ఆలయానికి ఒకేరోజు రూ.12 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని రుద్రకోడు క్షేత్రంలో వెలిసిన రుద్రకోటేశ్వర, రుద్రాణి మాతకు భక్తులు పూజలు నిర్వహించుకున్నారు. క్షేత్ర సమీపంలోని కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్తీక దీపాలను వెలిగించి భక్తిభావాన్ని చాటుకున్నారు. రాత్రి 7 గంటలకు జ్యోతిని దర్శించుకున్నారు.

బండిఆత్మకూరు: ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఓంకారేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



నూలు ఒత్తులతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యాలు

భక్తులతో కిక్కిరిసిన సంగమేశ్వరం



కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్న దృశ్యం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: కార్తీక పౌర్ణమి శుక్రవారం సప్తనది సంగమేశ్వరం భక్తులతో కిక్కిరిసి పోయింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సంగమేశ్వరానికి తరలివచ్చారు. భక్తులు సూర్యోదయం నుంచి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నదిలో అరటి దొన్నెలతో దీపాలు వదిలారు. ఉమామహేశ్వరాలయం ప్రాంగణంలో వొత్తులు వెలిగించి బ్రహ్మసూత్ర శ్రీ సంగమేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు. పౌర్ణిమ సందర్భంగా శ్రీ లలితా దేవికి, శ్రీ చక్రానికి కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు.



స్థానిక రామేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలంకరణ చేస్తున్న భక్తులు

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరుతో పాటు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా సాగాయి. రామేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, తదితర విశేష పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

జూపాడుబంగ్లా: కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధతో జరిగాయి. మండల కేంద్రం జూపాడుబంగ్లాతోపాటు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జూపాడు అభయాంజనేయస్వామి, తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి, తూడిచెర్ల శ్రీశంకరమల్లేశ్వరస్వామి, తాటిపాడు వీరభద్రస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రస్వామి, శంకరమల్లేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు లింగాకృతిలో సహస్రదీపాలంకరణ చేసి శివనామాన్ని స్మరించుకున్నారు. అనంతరం కేసీ కాల్వలో గంగామాతకు దీపాలు వదిలి మొక్కులు తీర్చుకొన్నారు.

నందికొట్కూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో పూలతో అలంకరించిన శివలింగం ఆకట్టుకుంది.



ప్రత్యేక అలంకరణంలో శివలింగం



బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీలతో మాట్లాడుతున్న ఎస్పీ



మహానంది: కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఆత్మకూరు: జ్వాలా తోరణోత్సవంలో భక్తులు



ఓంకారేశ్వరాలయ ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు

నవనందులకు దేశవ్యాప్త గుర్తింపునకు కృషి

మహానంది: నవనందుల ఆలయాల ప్రాశస్త్యాన్ని యావత్ భారతదేశానికి చాటిచెప్పాలన్నదే లక్ష్యమని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ చాప్టర్ జిల్లా కన్వీనర్ ఎంవీ శివకుమార్‌రెడ్డి తెలిపారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా నంద్యాల నుంచి ప్రారంభమైన నవనందుల ప్రదక్షిణ కార్యక్రమం మహానందికి చేరుకుంది. కార్యక్రమం వెంట పీఠాధిపతి కమలానంద భారతి స్వామి, ఆధ్యాత్మిక వేత్త రాధామనోహర్ దాస్‌తోపాటు వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహానందిలో సాయంత్రం ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



కేరళ వాయిద్య కళాకారుల ప్రదర్శనలు

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి



పుస్తక పఠన చేస్తున్న విద్యార్థులు

పగిద్యాల: ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని లైబ్రేరియన్ మద్దమ్మ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండవరోజు శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో కథలు, నవలలు, సాహిత్యం, పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు.

నందికొట్కూరు: మండల కేంద్రం పాములపాడు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనం ప్రయోజనాలను విద్యార్థులకు ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కృష్ణారెడ్డి వివరించారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

బండిఆత్మకూరు: జాతీయ గ్రంథాలయ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయ అధికారి డి.మధు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు.

వెలుగోడు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయంలో లైబ్రేరియన్ సుమలత పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయాల ప్రయోజనాలను విద్యుత్ ఏఈ రవీంద్ర నాయక్ వివరించారు. అదేవిధంగా మాదకద్రవ్యాలు వలన కలిగే అనర్థాలను డాక్టర్ శివరామిరెడ్డి విశదీకరించారు.

పనిభారం తగ్గించాలి

కొత్తపల్లి: పనిభారం తగ్గించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మేరికి పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు చిన్నస్వామి, పార్థసారథి, చాందిని మాట్లాడుతూ సచివాలయాల బాధ్యతల మూలంగా పని భారం పెరిగిందని, ఒత్తిడికి గురువుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీల పరిపాలన బాధ్యతలు, ఇతర సర్వేలు తదితర విధులు ఉంటాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు స్రవంతి, అజ్మతున్నీసా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇతర పనులు చెప్పొద్దని పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో సుబ్రమణ్యంకు వినతి పత్రం పంచాయతీ కార్యదర్శులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయం డీడీఓ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఎస్ అసోసియేషన్ మండల సెక్రటరీ మొల్ల నూరుల్లా, సభ్యులు రవీంద్రబాబు, రాజశేఖర్, ముర్తుజావలి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ మేరికి వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న పీఎస్‌లు

రాజకీయ, మత సమావేశాలకు అనుమతివ్వొద్దు

జూపాడుబంగ్లా: ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల ఆవరణలో రాజకీయ, మత సమావేశాలు, వివాహాల నిర్వహణకు హెచ్‌ఎంలు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి కార్యకలాపాలకు కొందరు హెచ్‌ఎంలు అనుమతులు ఇస్తున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిందన్నారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలని, విరుద్ధంగా వ్యవహరిస్తే సంబంధిత హెచ్‌ఎంలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఆత్మకూరు: మండలంలోని కరివేణ గ్రామంలోని బుడ్డా వెంగళరెడ్డి కాలనీలో కొట్టం కాలిపోయి సర్వంకోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహానాయక్, మండల కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు కాలిపోయిన గుడిసెను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం గుడిసె ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యిందన్నారు. సర్వం కోల్పోయన శ్రీనివాసులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నూర్‌హమద్, దేవేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కరివేన బాధితులకు ఆర్థిక సాయం

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయి నిరాశ్రయులైన బాధితులకు శుక్రవారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. పట్టణానికి చెందిన సామాజిక వేత్త, రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆకుల సలాంబాషా తదితరులు తమవంతుగా నగదు అందజేశారు.

12 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను డిసెంబర్ 12, 13వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘురామచారులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ‹చదువుల తల్లిని మళ్లీ పలకరిద్దాం› అనే కార్యక్రమం ద్వారా స్వర్ణోత్సవ వేడుకలను చేపడతామన్నారు. 1974 సంవత్సరంలో ఆత్మకూరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యిందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా, ప్రిన్సిపాళ్లుగా, డాక్టర్లు, కలెక్టర్లుగా, రాజకీయ, వ్యాపారవేత్తలుగా ఎదిగారన్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. వేడుకల్లో పాల్గొనే వారు 9985982892, 9849582759 నంబర్లను సంప్రదించాలన్నారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించండి

ఆత్మకూరు: గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్‌బాబు, గిరిజన సమైక్య నాయకులు పుల్లన్న, వెంకటరమణరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఆర్డీఓ, ఐటీడీఏ పీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ ప్రాంతాల్లో గిరిజనులకు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు ఐటీడీఏ అధికారులు గిరిజనుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనుల సమావేశంలో స్థానిక సర్పంచ్‌ను విస్మరించడం తగదన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

జూపాడుబంగ్లా: కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. కొనలేం... తినలేం అన్నట్లుగా ధరలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో శుక్రవారం ఉదయం నిర్వహించిన వారాంతపు సంతలో కూరగాయాల ధరలు మిన్నంటాయి. ప్రతీది కిలో రూ.60లు పైబడి పలుకడంతో పేదోళ్లు అయోమయానికి గురయ్యారు. టమాటా ధర మాత్రం పేదలకు అందుబాటులో ఉంది. బెండ కిలో రూ.60, వంకాయలు రూ.80, కాకరకాయలు కిలో రూ.60, క్యాబేజీ కిలో రూ.60 ఇలా ఏది పట్టుకున్నా ధర భగ్గుమంది. తప్పని పరిస్థితుల్లో సామాన్యులు అరకిలోతో సరిపెట్టుకున్నారు. .



సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడికి గాయాలు

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు చివారులో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దివ్యాంగునికి గాయాలయ్యాయి. ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. హైదరాబాద్ ఉప్పుగూడకు చెందిన సలీం జూపాడుబంగ్లా మండలంలోని తూడిచర్ల గ్రామంలోని స్నేహితుడిని చూసేందుకు మూడు చక్రాల బైక్‌పై వెళ్తున్నాడు. ఈ బైక్‌ను నందికొట్కూరు శివారులో కర్ణాటకకు చెందిన ఐచర్ వాహనం ఢీకొట్టింది. సలీం తలకు, చేతులకు గాయాలు కావడంతో 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గాయపడి దివ్యాంగుడు సలీం